
# దగ్గు ఎంతకూ తగ్గదే




| సంవత్సరం | డెంగీ | మలేరియా |
|---|---|---|
| జనవరి–అక్టోబరు | 272 కేసులు | 17 కేసులు |

**1** నంద్యాల పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యుడికి చూపిస్తే తగ్గలేదు. చివరికి సర్వజన వైద్యశాలలోని ఓపీ నంబరు తొమ్మిదో గదికి వచ్చారు. ఆయనకు వైరల్ ఫీవర్ సోకిందని గుర్తించిన వైద్యులు మందులు రాసిచ్చారు.

**2** నగరానికి చెందిన రేణుక నాలుగు రోజులుగా జ్వరంతో పాటు జలుబు, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు సర్వజన వైద్యశాలకు వెళ్లి వైద్యులకు చూపగా మందులు రాసిచ్చారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైరల్ ఫీవర్ విస్తరిస్తోంది. వేలాది మందిని దగ్గు ఇబ్బంది పెడుతోంది. బాధితులతో కర్నూలు సర్వజన వైద్యశాలలోని తొమ్మిదో నంబరు గది కిక్కిరిసిపోతోంది. నిత్యం 100 మందికిపైగా చికిత్స నిమిత్తం వస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తుండటంతో ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు.

### వాతావరణంలో మార్పులతో..

వాతావరణంలో మార్పులు రావడం.. ఇటీవల కురిసిన వర్షాలతో దోమల బెడద తీవ్రమైంది. దీనికితోడు మురుగునీరు ముందుకు కదలకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా జనం రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గుతో ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోకుండా ఇంటివద్దే మందులు వాడుతున్నారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో కాచి వడబోసిన నీటినే తాగాలని, బయట అపరిశుభ్ర పరిసరాల్లో అమ్ముతున్న ఆహారం తీసుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఇంట్లో వేడిగా ఉండే పదార్థాలు తీసుకోవాలని.. ఇళ్ల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు వినియోగించుకోవాలని.. కిటికీలకు జాలీలు వంటివి పెట్టుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### ఆందోళన అవసరం లేదు..

**– డాక్టర్ మీనుగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు ఆస్పత్రి**

వాతావరణంలో మార్పుల కారణంగా విష జ్వరాలు వస్తున్నాయి. దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి రెండు, మూడు రోజులపాటు చికిత్స పొందాలి. బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు. అందరూ కచ్చితంగా మాస్కులు ధరించాలి. వీలైనంత వరకు బయట ఆహార పదార్థాలను తినకపోవడమే మంచిది.

## శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు


నగదు లెక్కిస్తున్న భక్తులు, పర్యవేక్షిస్తున్న మేనేజర్ వెంకటేశ్ జోషి

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి హుండీ ఆదాయం రూ. 3,38,02,400 సమకూరినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. సెప్టెంబరు చివరి నుంచి అక్టోబరు 24వ తేదీ వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు. రాఘవేంద్ర స్వామికి కానుకలు, ముడుపుల రూపంలో భక్తులు సమర్పించిన నగదు రూ. 3,30,57,440 కాగా, చిల్లర నాణేలు రూ. 7,44,960 కలిపి మొత్తం రూ. 3,38,02,400, బంగారం 136 గ్రాములు, వెండి 1,180 గ్రాములు వచ్చిందని, ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేశ్, కోణాపూర్, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్ పాల్గొన్నారు.

## 2న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలు వచ్చే నెల 2న జడ్పీలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు సీఈవో నాసరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ఏడు స్థాయీ సంఘ సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

# అర్ధరాత్రి ఉల్లికిపాటు

■ నిలిచిన క్రయవిక్రయాలు
■ మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి


బారులు తీరిన ట్రాక్టర్లు

ఉల్లి రైతులకు కంటి మీద కునుకు కరవైంది.. అమ్మకానికి పంట తీసుకొచ్చిన వారు జాగరణ చేయాల్సి వస్తోంది.. అధికారులకు ముందస్తు వ్యూహం లేకపోవడంతో కర్షకులు రోడ్డుపై పడ్డారు. మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది కర్నూలు వ్యవసాయ విపణికి ఉల్లి పోటెత్తుతోంది. గత నెల రోజులుగా ఉల్లి ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు వరుస కట్టారు. నిత్యం రికార్డు స్థాయిలో 20–22 వేల క్వింటాళ్ల వరకు వస్తోంది.. వ్యాపారులు కొనుగోలు చేసి సరకును సకాలంలో బయటకు తరలించలేకపోయారు.. ప్రస్తుతం ఆరు వేల టన్నుల వరకు నిల్వలు పేరుకుపోయాయి.. ఉల్లి గుట్టలు ఖాళీ చేసిన తర్వాతనే సరకును కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు.. అప్పటి వరకు రైతులంతా రోడ్లపై నిరీక్షించాల్సిందే.

**- న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్**

| తేదీ | క్వింటాళ్లు | గరిష్ఠం (రూ.) | మధ్యస్థం (రూ.) | కనిష్ఠం (రూ.) |
|---|---|---|---|---|
| 18 | 5,046 | 4,219 | 3,968 | 667 |
| 19 | 4,643 | 4,329 | 3,591 | 495 |
| 21 | 13,070 | 4,389 | 3,674 | 769 |
| 22 | 9,736 | 4,429 | 3,919 | 539 |
| 23 | 19,870 | 4,581 | 3,589 | 444 |
| 24 | 19,711 | 4,639 | 3,888 | 444 |
| 25 | 22,500 | (కొనుగోళ్లు జరగలేదు) | | |

### వ్యాపారులు కుమ్మక్కయ్యారు



**– ప్రతాపరెడ్డి, ఉల్చాల**

ఐదెకరాల్లో రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఉల్లి సాగు చేశా. వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షాలతో దిగుబడులు తగ్గాయి. ఇటీవల క్వింటా రూ.1,800 చొప్పున 55 క్వింటాళ్ల ఉల్లి విక్రయించా. ప్రస్తుతం 95 ప్యాకెట్ల ఉల్లి అమ్ముకునేందుకు విపణికి తీసుకొచ్చా. ఎకరాకు 200 ప్యాకెట్ల ఉల్లి దిగుబడులు రావాలి. అలాంటిది సగానికి సగం పడిపోయింది. వచ్చిన అరకొర పంటను అమ్ముకుందామంటే వ్యాపారులు సిండికేటై ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.


ఉల్లి సంచులపైనే రైతుల కునుకు

### 3 రోజులు.. 65,500 క్వింటాళ్లు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 17,763 హెక్టార్లలో ఉల్లి సాగైంది. ఉల్లి కొనుగోళ్లకు కర్నూలు మార్కెట్ ప్రసిద్ధి. ఇక్కడికి ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులతోపాటు తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా రైతులు సరకు తీసుకొస్తుంటారు.

ఈ సీజన్‌లో ఆగస్టు నుంచి విక్రయాలు ప్రారంభయ్యాయి. ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులంతా మార్కెట్‌కు వరుస కట్టారు. గత మూడు రోజుల వ్యవధిలో 67,500 క్వింటాళ్లు వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

### సర్వర్.. ఎర్రర్..

ఈ-నామ్ విధానం అమలవుతున్న విపణుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. నాలుగైదు రోజులైనా పరిష్కరించకపోవడంతో వ్యాపారులు మాన్యువల్‌గా టెండర్లు వేస్తున్నారు. టెండర్లు వేసే ప్రక్రియ పూర్తై ధర ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

### నిశీధిలో తూకాలు

ఈ-నామ్ విధానం పనిచేయకపోవడంతో వ్యాపారులు మాన్యువల్‌గా టెండర్లు వేస్తున్నారు. టెండర్లు వేసే ప్రక్రియ పూర్తై ధరలు ప్రకటించేందుకు సాయంత్రం 5 నుంచి 6 గంటలవుతోంది. రాత్రి 7 గంటలకు తూకాలు మొదలు పెడుతున్నారు.

గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు తూకాలు పూర్తి కాలేదు. బుధవారం సాయంత్రం మార్కెట్‌కు సరకును తీసుకొచ్చిన రైతు శుక్రవారం ఉదయం 10 గంటల తర్వాత ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. రేయింబవళ్లు విపణిలోనే నిరీక్షిస్తున్నారు.

### అధికారుల ఘోర వైఫల్యం

గతంలో ఇంతకంటే అధిక మొత్తంలో అన్నిరకాల పంట ఉత్పత్తులు వచ్చిన సమయంలోనూ ఏనాడు మార్కెట్‌లో క్రయవిక్రయాలు ఆపేసిన దాఖలాలు లేవు. మార్కెట్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం.. వ్యాపారులు. రైతులను సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారు.

నిత్యం మధ్యాహ్నం 2 గంటలలోపు ధరలు ప్రకటించి ఉల్లి క్రయ విక్రయాలు జరిగేలా చూస్తే విపణిని పూర్తిస్థాయిలో బంద్ చేసే పరిస్థితి ఉండదు.. సాయంత్రం 5-రాత్రి 7 గంటల లోపు తూకాలు పూర్తవుతాయి.

గత మూడు రోజులుగా రాత్రి వేళల్లో తూకాలు వేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది పత్తా లేకుండా పోయారు. తూకాలు ఎవరు వేస్తున్నారు.. మోసాలేమైనా జరుగుతున్నాయా అన్న విషయాన్ని పట్టించుకోలేదు.


పరిశీలన

### అన్నదాతకు ఆకలిమంట


భోజనం కోసం ఎదురుచూస్తున్న రైతు

అందరికీ అన్నం పెట్టే అన్నదాత పంట అమ్ముకోవడానికి పస్తులుండాల్సి వస్తోంది. కర్నూలు మార్కెట్‌కు పంట తీసుకొచ్చే రైతులకు మధ్యాహ్న భోజనం రాయితీపై అందిస్తారు. నిత్యం ఎంత మంది రైతులు మార్కెట్‌కు సరకు తీసుకొస్తున్నారో వారందరికీ భోజనం అందించాల్సి ఉంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 22,500 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు విపణికి వచ్చాయి. మరోవైపు ఎంతమంది రైతులు సరకు తీసుకొస్తున్నారన విషయాన్ని మార్కెట్ కమిటీ అధికారులు ఇస్కాన్ వారికి స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వారు రోజువారీ అంచనా ప్రకారం 400 మందికి భోజనం పెట్టారు. మిగిలిన వారందరూ బయట తినాల్సిన పరిస్థితి. చాలా మంది సరకు వదిలి వెళ్లలేక ఆకలితో అల్లాడిపోయారు.

### ధర తగ్గించారు



**–రాంభూపాల్, కౌలురైతు, పంచలింగాల**

బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50-60 పలుకుతోంది.. ఇక్కడి వ్యాపారులు ఒక్కటై రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు లాట్లను రూ.4 వేలు పెడుతున్నారు. మిగిలిన సరకును రూ.1,500-2 వేల లోపు ధరకు తీసుకుంటున్నారు. 1.60 ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తే 120 ప్యాకెట్ల దిగుబడి వచ్చిందని.. రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టా.. విపణిలో ధర చూస్తే క్వింటా రూ.2 వేలకు మించి ధర రావడం లేదు.

## నేరగాళ్లపై నిఘా


కానిస్టేబుల్ ఆదిలక్ష్మికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : రౌడీషీటర్లు, అనుమానితులు తదితరులపై నిఘా పెంచి నేరాలు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష నిర్వహించారు. సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసులు, తీవ్రమైన నేరాల కేసులు, అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. 2022, 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి కేసుల పురోగతి, అపరిష్కృత కేసులకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. దోపిడీ, దొంగతనాల కేసుల్లో రికవరీ శాతం పెంచి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పలు కేసుల్లో ప్రతిభ చూపిన ఎస్సైలు కె.శ్రీనివాసులు, వి.శ్రీనివాసులు, మహేష్‌కుమార్, విజయ్ కుమార్, తిమ్మారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, షేక్ అక్బర్‌బాషా, మురళీకృష్ణ, కానిస్టేబుళ్లు వినోద్, ఎర్రిస్వామి, ఆదిలక్ష్మిని ఎస్పీ అభినందించారు.

## 28 వరకు ఉల్లి కొనుగోళ్ల నిలిపివేత



కర్నూలు మార్కెట్లో కొనుగోలుచేసిన సరకును బయటకు తరలించేందుకు మరో మూడు పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం వచ్చిన 50 వేల ప్యాకెట్ల ఉల్లిని శనివారం కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించారు. ఆదివారం సెలవు, సోమవారం కూడా మార్కెట్‌లో ఉల్లితోపాటు అన్ని రకాల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగవని మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మి పేర్కొన్నారు. రైతులు మార్కెట్‌కు సరకును తీసుకురావొద్దని విన్నవించారు. **– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం**

## బీఈడీ పరీక్ష వాయిదా

● ఓ కళాశాల తీరు ఇందుకు కారణం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఓ కళాశాల నిర్వాహకుల తీరు కారణంగా రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం జరగాల్సిన పరీక్షను వాయిదా వేయాల్సి వచ్చింది. బీఈడీ మొదటి ఏడాది ఒకటో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 23 నుంచి ప్రారంభయ్యాయి. మొత్తం 17 కేంద్రాల్లో సుమారు 4,500 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. శుక్రవారం ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఎర్నింగ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ పరీక్ష జరగాల్సి ఉంది. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా.. 1.50 గంటల ప్రాంతంలో పరీక్షను 30వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలపడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. నంద్యాల పట్టణ కేంద్రంలోని ఎస్వీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో 25వ తేదీన జరగాల్సిన పరీక్ష ప్రశ్నపత్రం ఒక రోజు ముందే.. 24వ తేదీన విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత దానిని వెనక్కి తీసుకున్నారు. ఈ విషయాన్ని అప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలపాల్సి ఉండగా నిర్లక్ష్యం చేశారు. ఆర్‌యూ అధికారులకు శుక్రవారం ఆలస్యంగా సమాచారం ఇవ్వడంతో వారు స్పందించి పరీక్ష వాయిదా వేయాలని నిర్ణయించారు. వెంటనే బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చారు.

## పోటాపోటీ

నగరంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు అండర్-14, 17 బాలబాలికల యోగా, చదరంగం పోటీలూ ఆసక్తిగా కొనసాగుతున్నాయి. 13 జిల్లాల నుంచి 900 మంది తరలొచ్చారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలతో క్రీడా పండగ వాతావరణం నెలకొంది.



లక్ష్యంపై గురి
ఆసక్తిగా తిలకిస్తున్న క్రీడాకారులు
ఈనాడు – కర్నూలు
ఆనంద 'యోగ'ం
'హై'జంప్
జావెలిన్ త్రో

## అవినీతి పనులపై విచారణ

● కౌన్సిల్ సమావేశంలో మంత్రి భరత్
● 'ఈనాడు'లో వరుస కథనాలు


నగరపాలక పరిధిలో జరిగిన అక్రమాలపై 'ఈనాడు'లో వచ్చిన కథనాలను వివరిస్తూ మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


అక్రమాలపై విచారణ జరపాలంటూ వివిధ కథనాల క్లిప్పింగులు చూపుతూ మాట్లాడుతున్న కార్పొరేటర్ యునూస్


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక నిధులు దుర్వినియోగం చేశారు.. చేయని పనులకు బిల్లులు చేసుకున్నారు. సి. బిల్లుల పేరుతో స్వాహా చేశారు. హెడ్ వాటర్‌వర్క్స్‌లో అవి'నీటి' రాజ్యమేలింది.. అక్రమాల తీరుపై 'ఈనాడు'లో వరుస కథనాలు వచ్చాయి.. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల తీరుపై శుక్రవారం జరిగిన కర్నూలు నగరపాలక పాలకవర్గ సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. 'ఈనాడు'లో వచ్చిన కథనాలను ఆమె సభలో చదివి వినిపించారు. వాటిని మంత్రి టీజీ భరత్‌కు అందజేశారు. విజిలెన్స్ అధికారులే స్వయంగా విచారణ చేసేలా చూడాలని ఆమె మంత్రిని కోరారు. నిధులను కొల్లగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఇలాంటివి పునరావృతం అవుతాయి.. కల్లూరు పట్టణ పరిధిలో పార్కు స్థలాలు కబ్జాలు గురయ్యాయి.. అన్యాక్రాంతమైన పార్కు స్థలాలను పరిరక్షించుకోవడానికి ప్రత్యేక కమిటీ వేయాలని ఆమె డిమాండ్ చేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ అక్రమాలపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు.



## వేతన వేదన

సుంకేసుల జలాశయం వద్ద పనిచేస్తున్న 12 మంది సిబ్బందికి జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గత 10 నెలలుగా వేతనాలు రావడం లేదు. జలవనరుల శాఖ పరిధిలోని అధికారులు సైతం వారి సమస్యను పట్టించుకోవడం లేదు. బ్యారేజీకి ఎప్పుడు వరద వస్తుందో తెలియదు. ఈ నేపథ్యంలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. నిత్యం వరద నీటిని పరిశీలిస్తూ మిగులు నీటిని దిగువకు విడుదల చేయాల్సి ఉంది. అంతటి కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్నా జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**– న్యూస్‌టుడే, కర్నూలు జలమండలి**

### చలికి వణుకుతూ..

తుంగభద్ర నది నుంచి భారీగా వచ్చే వరద నీటిని దిగువకు విడుదల చేయాల్సిన నేపథ్యంలో సిబ్బంది రేయింబవళ్లు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయినా వీరికి ఎలాంటి అదనపు వసతులు కల్పించడం లేదు. అలవెన్సులు ఇవ్వడం లేదు. చివరికి చలికి వణుకుతూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. కనీసం వీరి కోసం అవసరమైన విశ్రాంతి గది కూడా లేకపోవడం గమనార్హం.

○ సుంకేసుల బ్యారేజీకి ఒక ఏఈ ఉన్నప్పటికీ బాధ్యతలన్నీ సిబ్బంది చూడాల్సిందే.. ప్రధానంగా గేట్లకు గ్రీజు పూయడం, గేట్ల రోప్‌లు తెగిపోయినా.. విద్యుత్తు కేబుళ్ల మరమ్మతులకు గురైనా.. ఇతరత్రా ఏం జరిగినా వీరే బాధ్యత వహించాల్సిన పరిస్థితి. ప్రత్యేకంగా సాంకేతిక ఉద్యోగి ఎవరూ లేరు. ఇంతలా కష్టపడుతున్నా ప్రయోజనం లేకపోతోంది. ఈ నేపథ్యంలో సిబ్బంది తమ సమస్యను శుక్రవారం ఎస్ఈకి విన్నవించారు. జీతాలు మంజూరు చేయాలని కోరారు.

### పలుమార్లు మొరపెట్టుకున్నాం

**– రాము, జలాశయం ఎలక్ట్రీషియన్**

సుంకేసుల బ్యారేజీ వద్ద ఏళ్ల తరబడి పనిచేస్తున్నా.. కనీస వేతనం అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఆప్కాస్ కింద నమోదు చేశారు. కానీ అది అమలు కాలేదు. ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరుతున్నాం.. ఇక్కడ రేయింబవళ్లు పనిచేస్తున్నా ఫలితం దక్కడం లేదు.

# పతకాల కిక్

**ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే:** ఆ విద్యార్థినులు ఒకవైపు చదువులో రాణిస్తూ మరోవైపు క్రీడల్లోనూ సత్తాచాటుతూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహిస్తుండటంతో ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొని పతకాల పంట పండిస్తున్నారు. ఆటలతో జీవితంలో ఉన్నతస్థితికి చేరాలని పడకండ్లలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు కోరుకుంటున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కరాటేలో గురుకులం విద్యార్థినులు ప్రతిభతో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

## క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం



జ్యోతి

ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలోని పడకండ్ల గురుకులంలో ఇంటర్ చదువుతున్న జ్యోతి కరాటేలో అద్భుత ప్రతిభ చూపిస్తున్నారు. రాజంపేటలో ఈనెల 1న జరిగిన అంతర్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమంగా రాణించారు. అండర్- 16 విభాగంలో ముగ్గురు ప్రత్యర్థులను చిత్తుచేసి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆమె ప్రతిభను మెచ్చిన సెలెక్టర్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆమె తర్ఫీదు పొందుతున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై క్రీడాకోటాలో ఉద్యోగం సాధించాలనేదే తన లక్ష్యమని జ్యోతి చెబుతున్నారు.

## కరాటేలో సాధన



మేరీ కల్పన

పడకండ్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న మేరీ కల్పనకు కరాటే అంటే ఎక్కువ మక్కువ. ఈ క్రీడలో రాణించాలనే లక్ష్యంతో సాధన ప్రారంభించారు. రాజంపేటలో అంతర రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొన్నారు. మూడు బౌట్‌లలో పాల్గొని ప్రత్యర్థులను మట్టి కరిపించి ఫైనల్‌కు చేరుకుని రెండో స్థానంలో నిలిచారు. అటాకింగ్, డిఫెన్స్, కిక్కింగ్‌లో అద్భుత స్కోర్ సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పతకాన్ని సాధించాలన్న లక్ష్యంతో కరాటేలో సాధన చేస్తున్నానని కల్పన చెబుతున్నారు.

# నేడు అంతర కళాశాలల క్రీడా పోటీలు

**కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే:** కర్నూలు సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో ఆర్‌యూ అనుబంధ కళాశాలల క్రీడా పోటీలు శనివారం జరుగుతాయని ఆ కళాశాల డీన్ అడ్మినిస్ట్రేషన్ శౌరీలురెడ్డి శుక్రవారం తెలిపారు. సెపక్‌తక్రా, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర వాటిల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# బాణసంచా అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

**కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే :** అనుమతి లేని ప్రదేశాల్లో బాణసంచా నిల్వ చేస్తే పేలుడు పదార్థాల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకుంటామని ఎస్పీ జి.బిందుమాధవ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. అనుమతి పొందిన ప్రదేశాల్లో మాత్రమే వ్యాపారులు అమ్మకాలు చేయాలని పేర్కొన్నారు. బాణసంచా విక్రయించే ప్రాంతంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా విక్రయించినా.. రవాణా చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. విక్రయ ప్రదేశాల్లో అగ్నిమాపక వాహనం, అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. అక్రమంగా అమ్మకాలకు పాల్పడినా.. నిల్వ చేసినా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

# నాణ్యమైన విద్య అందిస్తాం

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** జిల్లా విద్యాశాఖ అధికారిగా శామ్యూల్‌పాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

# 56 మందికి ఏఈవోలుగా పదోన్నతి

**కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:** గ్రామ వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న 56 మందికి వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు)గా పదోన్నతులు కల్పించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 580 మందికిపైగా వీఏఏలు ఉండగా అందులో 534 మంది ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. అర్హత పరీక్షలో మెరిట్, రిజర్వేషన్ల రోస్టర్ ప్రకారం 56 మందికి పదోన్నతులు కల్పించినట్లు జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి శుక్రవారం తెలిపారు.

○ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

# క్రీడలతోనే ప్రత్యేక గుర్తింపు



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



**కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే :** క్రీడలతోనే ఎనలేని గుర్తింపు వస్తుందని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజు, డీవీఈవో పరమేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న, కేవీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లాలప్ప, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీధర్‌రెడ్డిలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ గత 50 ఏళ్ల నుంచి క్రీడలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. డీవీఈవో పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలతో క్రీడా పండగ వాతావరణం నెలకొందని చెప్పారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి 900 మంది బాలబాలికలు పోటీ పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల గౌరవ వందనాన్ని ముఖ్య అతిథులు స్వీకరించారు.

**బాలికల విభాగం:** 100 మీటర్ల పరుగులో తిరుషా (విజయనగరం) స్వర్ణం, సాయిప్రియ (కర్నూలు) వెండి, నందిని (విజయవాడ) కాంస్య పతకాలు గెలుచుకున్నారు. 800 మీటర్ల పరుగులో చైతన్య (విజయవాడ) స్వర్ణం, పావని (తూర్పు గోదావరి) వెండి, కల్యాణి (అనంతపురం) కాంస్యం సాధించారు. 400 మీటర్ల పరుగులో యశోద (విజయవాడ) స్వర్ణం, చైతన్య (విజయవాడ) వెండి, కీర్తన (గుంటూరు) కాంస్య పతకాలు అందుకున్నారు. హైజంప్‌లో లక్ష్మీతులసి (విజయనగరం) స్వర్ణం, చంద్రకళ (తూర్పు గోదావరి) వెండి, మీకా (విజయనగరం) కాంస్య పతకాలను సాధించారు.

**బాలుర విభాగం :** షాట్‌పుట్‌లో నాగవినయ్ (విశాఖ) స్వర్ణం, అభి (విశాఖ) వెండి, దిలీప్‌కుమార్ (చిత్తూరు) కాంస్య పతకం సాధించారు. 100 మీటర్ల పరుగులో గణేశ్ (నెల్లూరు), ధరేశ్వర్ (విజయవాడ), జ్యోతిశ్వర్ (శ్రీకాకుళం) వరుస స్థానాల్లో నిలిచి పతకాలు గెలుచుకున్నారు. 800 మీటర్ల పరుగులో వెంకటేశ్ (కర్నూలు) స్వర్ణం, శేషు (గుంటూరు) వెండి, రాజేశ్ (విజయవాడ) కాంస్య పతకాలు సాధించారు. 400 మీటర్ల పరుగులో మక్బుల్ హుసేన్ (కృష్ణా) స్వర్ణం, మహేంద్ర (కర్నూలు) వెండి, వినోద్‌కుమార్ (కర్నూలు) కాంస్య పతకాలు గెలుచుకున్నారు. హైజంప్‌లో దుర్గాప్రసాద్ (కాకినాడ), సుదర్శన్ నాయుడు (చిత్తూరు), చైతన్య (గుంటూరు) వరుస పతకాలు అందుకున్నారు.



కర్నూలు క్రీడాకారుల కవాతు



చదరంగంలో తలపడుతూ..

## రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

**కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే :** యోగా, చదరంగం పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి అన్నారు. కర్నూలు డీఎస్ఏ స్టేడియంలోని ఇండోర్ స్టేడియం యోగా హాలులో ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల యోగా, చదరంగం పోటీలను జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎన్.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి పరమేష్ తదితరులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించిన క్రీడాకారులకు ఉన్నత, ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు.

# పోటీతత్వం తప్పనిసరి

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ పేర్కొన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు జిజ్ఞాస-2కేలో ప్రతిభ చూపగా శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25వ తేదీల్లో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జిజ్ఞాస-2కేలో ఈసీఈ మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులు మొదటి బహుమతి సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్

# రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

**సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే:** శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,26,281 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. దీంతో శుక్రవారం జలాశయం రెండు వరద గేట్లను పది అడుగుల మేర పైకెత్తి 55,782 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ మరో 67,006 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 884.60 అడుగులు, నీటినిల్వ 213.4011 టీఎంసీలుగా నమోదైంది.



స్పిల్‌వే నుంచి విడుదలవుతున్న నీరు

○ రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు బేరసారాలు

○ ప్రజాప్రతినిధుల ఒప్పందాలు

# మద్యవర్తులతో గొలుసు దందా



కర్నూలులో ఓ మద్యం దుకాణం ముందు తాగుతూ..

**కర్నూలు నేరవిభాగం, ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఓ వైపు రాష్ట్రంలో కొత్త మద్యం విధానం మొదలైంది. ఇదే అదునుగా పల్లెల్లో కొత్త గొలుసు (బెల్టు) దుకాణాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 16 నుంచి ఉమ్మడి జిల్లాలో 196 దుకాణాలు ఏర్పాటయ్యాయి. అధికశాతం అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరులే అధిక శాతం దుకాణాలు నిర్వహిస్తున్నారు. మండల, గ్రామస్థాయి నాయకులు పల్లెల్లో గొలుసు దుకాణాల ఏర్పాటుకు చురుగ్గా పావులు కదుపుతున్నారు. మద్యం వ్యాపారులు సైతం వారి వ్యాపారం పెంచుకునేందుకు నాయకులతో చేతులు కలుపుతున్నారు. గొలుసు దుకాణ నిర్వాహకుల నుంచి రూ.50 వేలు నుంచి రూ.5లక్షల వరకు మద్యం వ్యాపారులు, నాయకులు అడ్వాన్సులు తీసుకుని, నిరంతరం మద్యం సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుంటున్నారు. మద్యం విక్రయించినందుకుగాను గొలుసు దుకాణ నిర్వాహకులకు లాభంలో పర్సంటేజీ చొప్పున వాటా ఇస్తున్నారు. ఎంఆర్‌పీ ధరను మించి విక్రయిస్తేనే లాభాలు వస్తాయనేది బహిరంగ రహస్యమే.

## అంతటా అదే..

ఆదోని పరిధిలో వ్యాపారులు, గొలుసు దుకాణాల నిర్వాహకులతో రూ.50వేలతో ఒప్పందాలు మొదలవుతున్నట్లు తెలుస్తోంది. కోడుమూరు పరిధిలో మాత్రం రూ.లక్షతో బేరాలు సాగిస్తున్నారు. సి.బెళగల్ మండలంలోని పలు గ్రామాల్లో వైకాపా, తెదేపా నాయకులు కలిసికట్టుగా గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటుండటం గమనార్హం. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

☛ నంద్యాల జిల్లా పరిధిలో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో తరహాలో ఒప్పందాలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రాలు, పల్లెల్లో ఏర్పాటైన దుకాణాల వారు మాత్రమే.. మద్యం సరఫరా చేయాలని స్థానిక నాయకులు ఆంక్షలు విధించారు. పట్టణ ప్రాంత వ్యాపారులు సరఫరా చేయరాదని నిబంధన విధించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో గొలుసు దుకాణాలు ఏర్పాటైనట్లు తెలిసింది. రూ.99 మద్యం సీసాకు విపరీతమైన గిరాకీ ఉంది. పల్లెలను గొలుసులతో కట్టేయనున్నారని మహిళలు ఆందోళన చెందుతున్నారు.



## మహిళలతో అమ్మకాలు..

గొలుసు దుకాణాల నిర్వాహకులు తెలివిగా మహిళలతో మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఇంటి వ్యవహారాలు చూసుకోవాల్సిన వారిని జైలుపాలుచేస్తుండటం దురదృష్టకరం. చట్టాల్లో లోపాలను ఆసరాగా చేసుకుని నిర్వాహకులు ఈ పంథాను ఎంచుకుంటున్నారు. ఇటీవల కర్నూలు మండల పరిధిలోని ఓ గ్రామంలో 75 మద్యం సీసాలతో పట్టుబడ్డారు. ఆబ్కారీశాఖలో మహిళా సిబ్బంది తక్కువగా ఉండటంతో మహిళలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచడం సమస్యగా మారుతోంది.

## చూసీచూడనట్లుగా..

"జిల్లా కేంద్రంలోని కర్నూలు జొహరాపురం రోడ్డులో మద్యం దుకాణాల నిర్వాహకులు అనధికారికంగా ఏకంగా గదులు ఏర్పాటు చేశారు. ఆ మార్గం ప్రస్తుతం తాగుబోతులకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు తిరగాలంటే భయపడుతున్నారు".

జిల్లాలో కొత్త మద్యం దుకాణ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మద్యనిషేధ, ఆబ్కారీశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అనుమతులు ఇచ్చిన అధికారులు.. నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. పలుచోట్ల దుకాణాల వద్దే తినుబండాలు, నీరు విక్రయిస్తూ.. అక్కడే తాగేలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల మండలాల్లో దుకాణాలు ఎలా ఉన్నాయో అంచనా వేయొచ్చు.

## పల్లెలను పంచుకుంటూ..

బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగించి ఆదాయ వనరుగా మార్చుకోవాలని కొందరు రాజకీయ నాయకులు మద్యం వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. గొలుసు దుకాణాలు సాఫీగా కొనసాగేలా అంతా తామే చూస్తామని, ఎవరెవరికి మామూళ్లు ఇవ్వాలో అన్నీ దగ్గరుండి చూసుకుంటామని భరోసా ఇస్తున్నారు.

## విద్యా సమాచారం

### పరీక్ష కేంద్రం మార్పు

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** నంద్యాల పట్టణంలోని ఎస్పీవై రెడ్డి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన బీఈడీ పరీక్ష కేంద్రాన్ని నేషనల్ డిగ్రీ కళాశాలకు మార్చినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో సుమారు 250 మంది మొదటి ఏడాది బీఈడీ సెమిస్టర్ పరీక్ష రాస్తున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రం మార్పు విషయాన్ని అభ్యర్థులు గమనించాలని కోరారు.

### దరఖాస్తు గడువు పొడిగింపు

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** సార్వత్రిక విద్యలో భాగంగా పది, ఇంటర్‌లో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులకు మరో అవకాశం ఇవ్వడంతోపాటు దరఖాస్తు సమయాన్ని పొడిగించినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి 29వ తేదీలోపు రూ.200 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

### పది వార్షిక పరీక్షల రుసుము చెల్లించండి

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షల రుసుము చెల్లించాలని డీఈవో శామ్యూల్‌పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి నవంబరు 11వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అపరాధ రుసుముతో నవంబరు 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. రుసుములను ప్రధానోపాధ్యాయులు వసూలు చేసి ట్రెజరీలో జమ చేయాలని సూచించారు.

# ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి చర్యలు

**కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే :** ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని.. బస్టాండులో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. కర్నూలులోని బస్టాండులో కల్పించాల్సిన సౌకర్యాలపై ఆయన శుక్రవారం నగరంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ప్రజారవాణాధికారి శ్రీనివాసులు తదితరులతో సుదీర్ఘంగా చర్చించారు. బస్టాండ్ ఆదాయ వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి చెప్పారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి పంపాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు హరినాథ్, కర్నూలు-1, 2 డిపో మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ అధికారులతో చర్చిస్తున్న మంత్రి టీజీ భరత్

# 27న ఎస్టీయూ కార్యవర్గ సమావేశం

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే :** నగరంలోని సలాంఖాన్ భవనంలో 27వ తేదీన ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గోకారి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు.. వాటి పరిష్కార మార్గాలపై సమావేశంలో సమీక్షిస్తామని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, రఘునాథరెడ్డి, ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ నాగేశ్వరరావు, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న హాజరవుతారని చెప్పారు. జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# రూ.25 కోట్ల తితిదే నిధులతో అభివృద్ధి పనులు

**మహానంది, న్యూస్‌టుడే :** నంద్యాల జిల్లాలో రూ.25 కోట్ల తితిదే నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తితిదే ఏఈఈ లక్ష్మీపతి చెప్పారు. మహానందిలో రూ.1.60 కోట్లతో నిర్మిస్తున్న తితిదే వసతి గదుల సముదాయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**కర్నూలు (వెంకటరమణ కాలనీ), న్యూస్‌టుడే :** సమస్యలు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాలు, విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ సంఘాల పిలుపులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నగరంలోని బీఎస్ఎన్ఎల్ జీఎం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. బీఎస్ఎన్ఎన్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.రామరాజు, సీసీడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.జలీల్ అహ్మద్, ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.విజయభాస్కర్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎన్ సంస్థ నుంచి 4జీ, 5జీ సేవలు అందించాలని డిమాండ్ చేశారు. 01.01.2017 నుంచి 15 శాతం వేతన, పింఛను సవరణ చేయాలన్నారు. ఒప్పంద ఉద్యోగులకు కనీస వేతనాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎ.రామలింగం, మద్దిలేటి, యాకోబు, భాస్కరరెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు

# ఎడ్ల బండి బోల్తా.. రైతు మృతి

**ఆస్పరి, న్యూస్‌టుడే:** పొలం పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా.. ఎడ్ల బండి బోల్తాపడటంతో రైతు మృతి చెందిన ఘటన ఆస్పరి మండలంలోని దొడగొండ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉరుకుందు(49) తన పొలం పనుల కోసం మరో రైతుకు సంబంధించిన ఎడ్లు, బండిని కట్టుకొని వెళ్లారు. తిరిగి ఇంటికి పయనమయ్యారు. రహదారిపై గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో టైర్ల ఎడ్ల బండి వెళ్లే సమయంలో ఇంటిని రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉండటంతో బోల్తా పడింది. అన్నదాత అక్కడికక్కడే మృతిచెందారు. ఉరుకుందుకు భార్య చంద్రమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెల వివాహం చేశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.



ఉరుకుందు (పాతచిత్రం)

# హంద్రీ వాగులో బాలుడి గల్లంతు?

**దేవనకొండ, న్యూస్‌టుడే:** దేవనకొండ మండలం అలారుదిన్నె గ్రామంలోని హంద్రీ వాగులో ఐదేళ్ల బాలుడు గల్లంతైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన నరసన్న, సోమేశ్వరి దంపతులు శుక్రవారం పొలానికి వెళ్తూ కుమారుడు మహేశ్ (5)ను వెంటబెట్టుకెళ్లారు. దంపతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పొలం గట్టు పైన బాలుడు చరవాణి చూస్తున్నాడు. కొద్దిసేపటి తరువాత వారికి కుమారుడు కనిపించలేదు. చరవాణి అక్కడే పడుంది. పక్కనే హంద్రీ వాగు ఉండటంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆ పరిసరాల్లో వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

# గోడ కూలి తాపీమేస్త్రీ మృతి

**కోసిగి, న్యూస్‌టుడే:** సంపు గోడ నిర్మాణ పనులు చేస్తుండగా ముందున్న గోడ కూలిపోయి ఈడిగ రామాంజనేయులు (28) అనే తాపీమేస్త్రీపై పడటంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. కోసిగి మండలం జంపాపురం గ్రామానికి చెందిన ఈడిగ కోసిగయ్య, మూకమ్మ దంపతుల కుమారుడు ఈడిగ రామాంజనేయులు తన భార్య మహేశ్వరి, ఇద్దరు కుమారులు, ఒక కూతురుతో కలిసి ఇటీవల వలస నిమిత్తం బెంగళూరుకు వెళ్లారు. శుక్రవారం వైట్‌ఫీల్డ్ సమీపంలోని ఓ భవనం దగ్గర సంపు గోడ నిర్మాణ పనులు చేస్తుండగా ఒక్కసారిగా గోడ కూలిపోయి మీదపడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు.



ఈడిగ రామాంజనేయులు (పాత చిత్రం)

# ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

## రిమాండు ఖైదీలకు ఉచిత న్యాయం


మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి లీల వెంకట శేషాద్రి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: కారాగారంలో ఉన్న రిమాండు ఖైదీలకు ఉచిత న్యాయం అందిస్తామని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి లీల వెంకట శేషాద్రి అన్నారు. ఆదోని ప్రత్యేక ఉప కారాగారాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి, భోజనం తదితర వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, రెండో అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి శ్రీవల్లి, జైలర్ నజీర్ అహ్మద్, న్యాయవాదులు, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై పోరాటం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: రాయలసీమ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు నరేష్, కుమార్, బాస, నారాయణప్ప, కృష్ణ, రుక్మిణి పాల్గొన్నారు.

## రీ సర్వే భూ సమస్యలు పరిష్కరిస్తాం

బైచిగేరి(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: రీ సర్వే భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బైచిగేరి గ్రామంలో శుక్రవారం రీ సర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరాముడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వేణు సూర్య, రీ సర్వే డీటీ పెద్దయ్య, మండల సర్వేయర్ ఈశ్వర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

○ బైచిగేరి గ్రామ సచివాలయాన్ని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

## మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం


హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నెట్టెకంటమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. మండలంలో 12 ఎంపీటీసీలు ఉన్నా.. ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సమావేశానికి వచ్చే తీరిక లేని విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు ఎంపీటీసీ సభ్యులు సంతకాలు చేసి వెళ్లిపోయారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. దీనిపై ఎంపీడీవో వరలక్ష్మి మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలకు ఇబ్బందులు రాకుండా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## ఇళ్లేమో దూరం..

# అద్దెలు భారం

• చేరేందుకు ఆసక్తి చూపని టిడ్కో లబ్ధిదారులు
• సమస్యల పరిష్కారంపై దృష్టిసారించని అధికారులు


టిడ్కో నివాసాలు




సొంతింట్లో చేరదామంటే.. అవి దూరంగా ఉన్నాయి. పట్టణంలో ఉండామంటే.. అద్దెలు భారంగా మారాయి. ఇదీ ఆదోని టిడ్కో గృహలబ్ధిదారుల పరిస్థితి. పట్టణ వాసుల ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో తెదేపా హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. 2019లో తెదేపా ప్రభుత్వం మారే సమయానికి 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పూర్తయిన ఇళ్లకు రంగులు మార్చి, ఇళ్ల పట్టాలు అందించింది. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించలేకపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా ఇళ్ల లబ్ధిదారులకు భరోసా కల్పిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. మౌలిక వసతులు కల్పించకుండానే గృహప్రవేశాలు చేయించడంపై అధికారులు దృష్టిసారిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

అద్దె ఆదోని పట్టణ శివారు శిరుగుప్ప రహదారిపై వంద ఎకరాలకు పైగా భూ సేకరణ చేసి 4,720 ఇళ్లు నిర్మించారు. వీరిలో 40 మంది గృహప్రవేశాలు చేయగా.. పది కుటుంబాలే ఇళ్లలో ఉంటున్నాయని సమాచారం. ఇటీవల ఆదోనిలో టిడ్కో నివాస ప్రాంతాల్లో లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయా సమస్యలపై లబ్ధిదారులు ప్రస్తావించారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. తాగునీరు, విద్యుత్తు కనెక్షన్లు, మురుగు కాల్వలు, రవాణా సౌకర్యం.. ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆర్థిక భారం తగ్గించుకోవాలనే ఆలోచనతో ఉన్నారు. టిడ్కో ఇంటి లబ్ధిదారులు చాలామంది అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఒక్కో ఇంటికి కనీసం రూ.4-6 వేలు అద్దె చెల్లిస్తున్నారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు అద్దె భారంగా మారింది.

### నిర్మాణం తీరు ఇదీ..

- మొదటి రకం 300 చ.అ. నివాసాలు ఉచితంగా ఇస్తారు. కేంద్ర, రాష్ట్ర వాటా రాయితీ రూ.3 లక్షలు.
- రెండో రకం 365 చ.అ. నివాసానికి లబ్ధిదారు వాటా రూ.50 వేలు. మూడో రకం నివాసానికి 430 చ.అ లబ్ధిదారు వాటా రూ.లక్ష (నాలుగు విడతల్లో) చెల్లించాలి.
- రెండో రకం ఇంటికి రూ.3.15, మూడో రకం ఇంటికి రూ.3.65 లక్షల బ్యాంకు రుణం అందిస్తారు.
- కేంద్రం నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.1.50 లక్షలు, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణ పథకం కింద మరో రూ.1.30 లక్షలు అందించింది.
- ఇంటి నిర్మాణ వ్యయం మొదటి రకం రూ.6.50 లక్షలు, రెండో రకం రూ.7.50 లక్షలు, మూడో రకం రూ.8.50 లక్షలు(2014-19) మధ్య కాలంలో.. ప్రస్తుతం మార్కెట్ విలువ పెరిగింది.

### అద్దె భారంతో ఇబ్బందులు



నా పేరు బాజమ్మ, ఎస్కేడి.కాలనీ చివరి వరసలో నివాసం ఉంటున్నాను. మా ఆయన దర్గన్న, ఆటోడ్రైవరు వృత్తితో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నాం. నెలకు అద్దె రూ.4 వేలు దాకా ఉంది. మేము మొత్తం ఆరుగురు కుటుంబ సభ్యులు. పేద వాళ్లం వచ్చే డబ్బులతో జీవనమే కష్టంగా మారిన తరుణంలో టిడ్కో ఇళ్లు మంజూరైంది. దీంతో అద్దె భారం తగ్గి ఇంటి నిర్వహణకు సరిపోతుందని భావించాం. ఇప్పటికి ఐదారేళ్లు గడిచాయి. ఇంతవరకు ఇళ్లు ఇవ్వలేదు. ప్రస్తుతం టిడ్కో ఇళ్లలో చేరాలని అధికారులు అంటున్నారు. మాకు కేటాయించిన ఇళ్లు నాలుగో అంతస్తులో ఉంది. పైప్‌లైన్ దెబ్బతిన్ని, వర్షం వస్తే కారుతుంది. ఇక మౌలికవసతులు కల్పన చేయాల్సి ఉంది. ఇన్ని సమస్యల మధ్య ఇళ్లలోకి ఎలా చేరాలి.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 8008573822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: **సమస్య:** ఆదోని పట్టణంలోని మేదరవీధి కొత్త ఆకాశవంతెన ముందు భాగంలో రహదారి అధ్వానంగా మారింది. దీని వల్ల టీజీకే.నగర్‌పై ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రహదారిని బాగుచేసి, సమస్యను దూరం చేయాలి. - **నరసింహ, ఆదోని**

**సమాధానం:** ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిశీలించి, పరిష్కరిస్తాం. - **కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

మద్దికెర, న్యూస్‌టుడే: **సమస్య:** మద్దికెరలోని మద్దమ్మ కుంట సమీపంలో వాగిడొడ్డిలోకి కుంట నీరు చేరుతోంది. మాకు దారి లేకుండా పోయింది. దారి చూపేలా చర్యలు చేపట్టాలి. - **వెంకటేశ్వర్లు, మద్దికెర**

**సమాధానం:** పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నీరు తగ్గితే పరిష్కారం చూపే వీలుంటుంది. - **శివకుమార్, పంచాయతీ కార్యదర్శి మద్దికెర**

చిప్పగిరి, న్యూస్‌టుడే: **సమస్య:** బంటనహాల్‌లో ప్రధాన రహదారుల్లో మురుగు ప్రవహించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వీధుల్లో మురుగు శుభ్రం చేయాలి. - **గోపాల్, బంటనహాలు**

**సమాధానం:** గ్రామ పంచాయతీ సిబ్బందిని పంపి వీధులు శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం. - **కె.సుశీలమ్మ, సర్పంచి, బంటనహాలు**

కోయిలకొండ(కృష్ణగిరి), న్యూస్‌టుడే: **సమస్య:** మండలంలోని కోయిలకొండ గ్రామంలో చిట్టాలకు వెళ్లే ప్రధాన రోడ్డులో మురుగు కాల్వలు చెత్తతో నిండాయి. మురుగు ముందుకు పారడం లేదు. అక్కడ మురుగు కాల్వ, సీసీ రోడ్డు నిర్మించాలి. - **గంగప్ప, కోయిలకొండ**

**సమాధానం:** మురుగు కాల్వల్లో చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం. - **లక్ష్మీశ్వరయ్య, సర్పంచి**

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: **సమస్య:** పత్తికొండ శివారు ప్రాంతాల్లో గుత్తి- ఆదోని ప్రధాన రహదారుల్లో ప్రమాద సూచికలు లేవు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి. - **వాహనదారులు**

**సమాధానం:** సూచిక బోర్డులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. వచ్చిన వెంటనే ఏర్పాటు చేయిస్తాం. - **శ్వేత, ఆర్అండ్‌బీ ఏఈ**

## నెరణికిలో పారిశుద్ధ్య చర్యలు

స్పందనకు వందనం

హొళగుంద, న్యూస్‌టుడే: నెరణికి గ్రామంలో అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన 'పల్లెల్లో జ్వరాల కలవరం' కథనానికి అధికారులు స్పందించి, గ్రామంలో పర్యటించారు. జ్వరబాధితుల ఇళ్లకు వెళ్లి, పరిసరాలు పరిశీలించారు. జిల్లా మలేరియా నివారణ ఉపసంచాలకుడు అధికారి మంజునాథ్, పంచాయతీ కార్యదర్శి షఫీ, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పర్యటించారు. జ్వర లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు.

## అన్నార్తులకు నాణ్యమైన భోజనం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలోని అన్న క్యాంటీన్‌ను పురపాలక ఛైర్ పర్సన్ శాంత, కమిషనర్ కృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డన, నాణ్యత, పరిమాణం పరిశీలించారు. వరుసల్లో భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. ప్రభుత్వం సేవలను ప్రజలు చేరువ చేయడం మన బాధ్యత అన్నారు. వెంట డీఈ రామ్మూర్తి, సిబ్బంది ఉన్నారు.


క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వారితో వివరాలు తెలుసుకుంటున్న పురపాలక ఛైర్‌పర్సన్, కమిషనర్

## ఉత్సాహంగా ఈనాడు వ్యాసరచన పోటీలు


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో చేపట్టిన 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు ఎంతో ఉపయోగపడుతున్నాయని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.మల్లికార్జున అన్నారు. ఆదోని పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8, 9, పదో తరగతి విద్యార్థులకు 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసాలు రాశారు. పోటీల్లో మొదటి స్థానంలో ఎ.అబ్దుల్ ఖాలిక్, రెండో స్థానంలో ఎం.ఎండి.నబీరసూల్, మూడో స్థానంలో జె.మహేంద్ర నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఉపాధ్యాయులు కె.రవి, ముజాహిద్ హుసేన్, ఈశ్వరమ్మ, వయాజుద్దీన్, మహేష్ బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక



ఆలూరు పట్టణంలోని పాత బస్టాండు నుంచి వాల్మీకి సంతకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. రహదారి పక్కన తక్కువ ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈ మార్గంలో విద్యార్థులు, కాలనీ వాసులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. సంత జరిగే బుధవారం రోజు రద్దీ ఎక్కువగా ఉంటుంది. నియంత్రిక చుట్టూ ఎలాంటి రక్షణ లేకపోవడంతో ప్రమాదం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆలూరు

## ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై శుక్రవారం ఆదోని మండల ఉపాధి కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా ఇన్‌ఛార్జి పీడీ వెంకటరెడ్డి హాజరై ఉపాధి పనులపై విచారణ చేపట్టారు. 2023, 24 సంవత్సరంలో 2080 పనులు జరిగాయి. ఇందుకు సంబంధించి రూ.25 కోట్లు వ్యయం చేశారు. వేతనాల కోసం రూ.19 కోట్లు, సామగ్రి రూ.6 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని, పనులకు హాజరు కాకపోయిన డబ్బులు ఖాతాలు జమ చేశారని సామాజిక తనిఖీ బృందం బయట పెట్టింది. మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన పనులపై రాత్రి 10 గంటల వరకు విచారణ సాగింది. కార్యక్రమంలో డ్వామా అదనపు పీడీ మాధవీలత, ఏపీడీ లోకేష్, ఏపీఈ శ్రీలత, ఎంపీడీవోలు రాజేంద్రప్రసాద్, గీతావాణి, ఏపీవోలు కలిక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం


ఆదోని అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న తెదేపా పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, నాయకులు శ్రీనివాస ఆచారి, తదితరులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా ఆదోని నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు జన్మదినం పురస్కరించుకుని ఆదోని అన్న క్యాంటీన్‌లో మూడు పూటలు అన్నదానం చేశారు. 19 వార్డు తెదేపా బాధ్యుడు శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో తెదేపా పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి భోజనాలు వడ్డించారు. ఆదోని పట్టణ శివారులోని ఆనాథాశ్రమంలో వృద్ధులకు, అనాథలకు శ్రీనివాసాచారి అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

○ ఆదోనిలో ఐటీడీపీ ఆధ్వర్యంలో మీనాక్షినాయుడు జన్మదిన వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఐటీడీపీ అధ్యక్షుడు సజ్జద్, నాయకులు సయ్యద్, అక్బర్ బాషా, మా బాషా, ఇక్బాల్ పాల్గొన్నారు.

## స్పెషల్ బ్రాంచి పోలీసులకు ప్రశంసలు


ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న అశ్వర్థబాషా, ఎర్రిస్వామి

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గంలో పనిచేస్తున్న స్పెషల్ బ్రాంచి పోలీసులు అశ్వర్థబాషా, ఎర్రిస్వామికి ఎస్పీ జి.బిందు మాధవ్ శుక్రవారం ప్రశంసా పత్రాలు అందించారు. దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు సమాచారం సేకరించి అందించినందుకు ఎస్పీ చేత ప్రశంసలు అందుకున్నారు.

## వ్యాయామంతో ఆరోగ్యం పదిలం


విద్యార్థులతో వ్యాయామం చేయిస్తున్న అధ్యాపకులు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: వ్యాయామంతో ఆరోగ్యం పదిలంగా జీవించవచ్చని ఎంఈవో రమేష్ అన్నారు. పత్తికొండ పట్టణంలోని మన్రోపేట పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. విద్యార్థులతో ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాసిం సాహెబ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు తెదేపా అండ

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆలయాల పాలకమండళ్లలో నాయీబ్రాహ్మణులకు చోటు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడం హర్షణీయమని ఏపీ నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర సాధికార సమితి సభ్యుడు రంగస్వామి అన్నారు. తెలిపారు. బీసీల ఉన్నతికి తెదేపా తోడ్పాటునందిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

## రైతులు సహకరించాలి

ఆస్పరి, న్యూస్‌టుడే: పశుగణనకు రైతులు సహకరించాలని తహసీల్దారు శివశంకర్ నాయక్, పశువైద్యులు ప్రవీణ్‌కుమార్, గాయత్రి కోరారు. చిగిళి, నగరూరు, శంకరబండ, చిన్నహోతూరు, ఆట్లకల్లు గ్రామాల్లో శుక్రవారం పశుగణన ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మురళీమోహన్, రాము, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: పశుగణన ప్రచార పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో పశువైద్యాధికారి ఆశోక్ శుక్రవారం విడుదల చేశారు. పశుగణన వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందని, పాడి రైతులు, మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాబార్డు అధికారులు

దేవనకొండ, న్యూస్‌టుడే: నాబార్డు ఆర్థిక సాయంతో మంజూరైన పనులను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ అబూవరాజన్ పేర్కొన్నారు. మాదాపురం గ్రామంలో శుక్రవారం వాటర్‌షెడ్ పనులను ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ రామాంజనేయులు, సీఈవో విజయభాస్కర్, అప్కాబ్ మేనేజర్ సమీరా సుల్తానా, నవయత అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సీఈవో నరసింహులు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాత అన్నారు. ఆదోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, విస్తరణ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పత్తి, వేరుశనగ, శనగ పంటలో తెగుళ్లు, పురుగుల నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆదోని ఏడీఏ అరుణకుమారి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ గిరీష్, ఆదోని వ్యవసాయ అధికారి ఆశోక్ కుమార్‌రెడ్డి, డివిజన్‌లోని వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాత

## పశుగణన పక్కాగా చేపట్టాలి


ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అధికారులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పశుగణన కార్యక్రమం పక్కాగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అఖిల భారత పశుగణన గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదోని పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటరమణ, డాక్టర్లు వంశీకృష్ణ, ప్రదీప్‌కుమార్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు గ్రామీణం: పశు గణన సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆలూరు పశు సంవర్ధక శాఖ ఏడీ విక్టర్, వైద్యులు విజయ్‌నాయక్ కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద శుక్రవారం గోడపత్రాలు విడుదల చేశారు.

## ఆటోను ఢీకొన్న లారీ

పత్తికొండ గ్రామీణం, పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ- గుత్తి ప్రధాన రహదారిలో పాలెమేకల సమీపంలో శుక్రవారం జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. పత్తికొండ నుంచి తుగ్గలి వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను వెనకైపు వెళ్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పి వెనక వైపు నుంచి ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాతన గ్రామానికి చెందిన చిన్నలక్ష్మయ్య, తిప్పన్న, పత్తికొండకు చెందిన ఆటోడ్రైవర్ షేర్ గాయపడ్డారు. వీరిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## యువకుడిపై కేసు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన 12 ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన బంగారు వ్యాపారి హరూన్‌బాషాపై కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. బాలిక షటిల్ ఆడుతుండగా.. అటువైపు వెళ్లిన హరూన్‌బాషా బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో దుర్భాషలాడారని ఆమె తల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అసంపూర్తి నిర్మాణం.. భవనాలు శిథిలం

ప్రారంభించిన అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఆదోని పట్టణంలోని పలు పాఠశాలలు, మద్దికెర మండలంలోని బురుజుల బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. నిధుల కొరత, సాంకేతిక లోపాల కారణంగా కాంట్రాక్టర్లు ఆ నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలాయి.

- న్యూస్‌టుడే, ఆదోని విద్య, మద్దికెర

### ఏళ్ల తరబడి నిర్లక్ష్యం

○ మద్దికెర మండలం బురుజుల బీసీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తిచేయలేదు. ఆ నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏళ్ల తరబడి అలాగే వదిలేశారు. గదులు పూర్తికాకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయని స్థానికులు నిరసన


మద్దికెర: బురుజులలో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న పాఠశాల అదనపు గది నిర్మాణం

వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి శిథిల భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం సైతం నిర్వహిస్తున్నారు. చిన్నారుల ప్రాణాలు బారిన పడకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

○ ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సుమారు 1800 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు- నేడు పథకం కింద సుమారు రూ.2.20 కోట్ల వ్యయంతో 20 అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. దీని నిర్మాణం పూర్తి కాలేదు. విడతల 14 అదనపు తరగతి గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

○ ఆదోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో 2వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. రూ.1.90 కోట్లతో 16 అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. ఈ రెండు పురాతన పాఠశాలలు. ఉన్నత పాఠశాల పక్కన నూతన గదుల నిర్మాణం పై అంతస్తులో 12 గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. సాంకేతిక లోపం వల్ల నిర్మాణం నిలిపివేశారు. భవనం అదనపు గదుల భారం మోయలేదని ఇంజినీరింగ్ నిపుణులు తేల్చారు. దీంతో నిర్మాణాలు అసంపూర్తిగానే వదిలేశారు.

# ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు


చెత్త తొలగిస్తున్న సభ్యులు

## తుంగాతీరంలో స్వచ్ఛభారత్

కౌతాళం, న్యూస్‌టుడే: కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో తుంగభద్ర నది ఒడ్డున స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సీడబ్ల్యూసీ అధికారులు, సిబ్బంది చేపట్టారు. శుక్రవారం వారు కౌతాళం మండలంలోని మేళిగనూరు గ్రామం వద్ద తుంగభద్ర నది ఒడ్డునున్న చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ జలవనరుల శాఖ ఆదేశాల మేరకు నిర్వహించినట్లు కర్నూలు ఇంజినీర్ నాగార్జున, మంత్రాలయం మధుకల్యాణ్, మేళిగనూరు సైట్ ఇన్‌ఛార్జి సందీప్ పేర్కొన్నారు.

## వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.5,990

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.5,990, మధ్యస్థం రూ.4,764, కనిష్ఠం రూ.2,830కు వ్యాపారులు కొన్నారు. రైతులు మార్కెట్‌కు 5,211 వేరుసెనగ బస్తాలు తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,904, మధ్యస్థం రూ.5,691, కనిష్ఠం రూ.5,079 పలికింది.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) మంత్రాలయం : 98859 97892 గోనెగండ్ల : 80085 73827

కోసిగి: **సమస్య:** కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే ఎస్సీ కాలనీ సమీపంలోని కాల్వలో మురుగు నిలిచి ముందుకు కదలడం లేదు. అధికారులు స్పందించి మురుగు తొలగించగలరు. – హనుమంతు, స్థానికుడు

**సమాధానం:** పారిశుద్ధ్య కార్మికులను పంపించి మురుగు తొలగిస్తాం.

– తిరుమలేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కోసిగి

## ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం

మంత్రాలయం, న్యూస్‌టుడే: కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను విధులకు హాజరైన రెండు నెలల్లోపే పరిష్కరించి ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు మాధవరం ఎస్సై విజయ్‌కుమార్ శుక్రవారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఎస్సై విజయ్‌కుమార్ మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఆగస్టు 25న విధుల్లో చేరారు. కర్ణాటక మద్యాన్ని అరికట్టడం, తుంగభద్ర తీరంలోని ఎత్తిపోతల పథకం ధ్వంసం చేసిన కేసులో నిందితులను పట్టుకోవడంతోపాటు ఇతర పెండింగ్ కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు.


ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మాధవరం ఎస్సై విజయ్‌కుమార్

## తగ్గుముఖం పట్టిన వరద

గూడూరు, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం నాటికి 65,700 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని జలాశయ ఇంజినీర్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. జలాశయం 1.235 టీఎంసీలు నిల్వ ఉండటంతో దిగువకు 65,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## తెదేపా కార్యకర్త మృతి

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని పోలకల్ గ్రామంలో శుక్రవారం తెదేపా కార్యకర్త మునిచంద్ర (35) గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రశేఖర్ ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పురపాలక దుకాణ సముదాయ యజమానులు, వ్యాపారులు నిబంధనలు ఉలంఘిస్తే చర్యలు తప్పవని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... దుకాణాల్లో వ్యాపారాలు చేసుకోవాలని, మద్యం, మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బినామీ దుకాణాలపై సర్వే చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

# కర్షకుని కష్టం.. కోలుకోలేని నష్టం

■ పట్టించుకునేవారు లేరని అన్నదాతల ఆవేదన
■ అంచనా వేసేందుకు రాని అధికారులు

| | |
|---|---|
| మండలం | |
| గ్రామం | |
| రైతు | |
| సాగు చేసింది | |
| జరిగిన నష్టం | |

పరిశీలన

కౌతాళం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు మంత్రాలయం నియోజకవర్గంలో చాలా వరకు పంట నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన వరి, మిరప, ఉల్లి, వేరుసెనగ పంటలకు కోలుకోలేని దెబ్బతగిలింది. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని కర్షకులు కన్నీరు కారుస్తున్నారు. మరోవైపు వ్యవసాయాధికారులు పంట నష్టం జరిగిన పొలాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మూడెకరాల్లో నేల వాలింది

| | |
|---|---|
| కౌతాళం | |
| గుడికంబాలి | |
| గోపాల్ నాయక్ | |
| వరి, 8 ఎకరాలు | |
| 3 ఎకరాలు, రూ.లక్ష | |





కౌతాళం, న్యూస్‌టుడే: గోపాల్‌నాయక్ వరి సాగుకు ఎకరానికి రూ.40 వేలు చొప్పున పెట్టుబడి పెట్టారు. మూడు ఎకరాలు మొత్తం నేలవాలింది. గుడికంబాలి గ్రామంలో మొత్తం 1,120 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 250 ఎకరాలు సాగవగా, సుమారు 45 ఎకరాల్లో పంటంతా నేలవాలింది. పత్తి 720, మిరప 150 ఎకరాల్లో సాగు చేశారు.

### రూ.6 లక్షలు నష్టపోయా

| | |
|---|---|
| పెద్దకడబూరు | |
| కల్లుకుంట | |
| సత్యనారాయణగౌడ్ | |
| మిరప, 8 ఎకరాలు | |
| 40 క్వింటాళ్లు రూ.6 లక్షలు | |

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: కల్లుకుంట గ్రామంలోని ఈ ఏడాది ఖరీఫ్‌లో మొత్తం 2,600 ఎకరాలు సాగైంది. పత్తి 1,200, మిరప 1,000, వరి 100, ఉల్లి 100, కంది 100, సజ్జ 100 ఎకరాల్లో సాగు చేశారు. వీటిలో అధికంగా మిరప, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారులు ఇప్పటి వరకు పంట నష్టాన్ని అంచనా వేయలేదని రైతులు వాపోయారు.


నేలపాలైన మిరపకాయలు చూపుతున్న రైతు

### కన్నీళ్లు మిగిల్చిన ఉల్లి

| | |
|---|---|
| కోసిగి | |
| దుద్ది | |
| గొర్లి తాయన్న | |
| ఉల్లి 2 ఎకరాలు | |
| రూ.1.50 లక్షలు | |

కోసిగి, న్యూస్‌టుడే: దుద్ది గ్రామంలో 1,656 ఎకరాలు సాగైంది. వరి 34, పత్తి 1,065, జామ 3, బొప్పాయి 6, దానిమ్మ 5, వేరుసెనగ 212, ఆముదం 34, మిరప 180, ఉల్లి 117 ఎకరాల్లో పండిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వేరుసెనగ 20, ఉల్లి 30 ఎకరాల వరకు తీవ్రంగా నష్టపోయారు. అధికారులు పంట నష్టం నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.


గొర్లి తాయన్న

## శ్రీమఠంలో కన్నడ భక్తుల కోలాటం

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయంలోని శ్రీమఠంలో కన్నడ భక్తుల కోలాటం ఎంతోగానో ఆకట్టుకుంది.


కోలాటం ఆడుతున్న మహిళలు

బెంగళూరు, మైసూర్, సింధనూరు, బళ్లారి, హొస్‌పేట, రాయచూర్, గంగావతి ప్రాంతాల నుంచి 10 భజన మండలి సభ్యులు శుక్రవారం ఆలయానికి వచ్చారు. ఒక్కో భజన మండలిలో 20 మంది మహిళల చొప్పున 200 మంది దాస సాహిత్య శిక్షణ శిబిరం నిర్వాహకుడు కౌతాళం అప్పనాచార్ ఆధ్వర్యంలో ప్రవచన మందిరంలో హరినామ సంకీర్తనలతో కోలాట ప్రదర్శన చేపట్టారు.

## ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీవో రాముడు తెలిపారు. ఎర్రదొడ్డి గ్రామంలో శుక్రవారం ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు. మొత్తం 30 ఇళ్లకుగాను 25 పూర్తయినట్లు సచివాలయ సిబ్బంది ఎంపీడీవోకు వివరించారు. పూర్తి చేయని లబ్ధిదారులకు ఎంపీడీవో అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంజినీరింగ్ సహాయకులు మండలంలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు.

## నైపుణ్యంతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం పెంచుకుంటే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్కిల్ హబ్ సమన్వయకర్త సుధాకర్ అన్నారు. శుక్రవారం ఎస్ఎంఎల్ కళాశాలలో ఉద్యోగమేళాను శ్రీరామ్ చిట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిభ ఉంటే ఉద్యోగాలు సాధించడం సులభమన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యం చదివితే అనుకున్నది సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మహబూబ్ బాషా, వైస్ ప్రిన్సిపల్ క్రాంతికుమార్, ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జి న్యూటన్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కిల్ హబ్ సమన్వయకర్త సుధాకర్

## ఆరుబయట వంట.. కళ్లు మంట

వైకాపా ప్రభుత్వంలో వంటశాలను ఏర్పాటు చేయకపోవడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ వంట గది లేకపోవడంతో పాఠశాల గోడ చాటున కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. నిత్యం పొగతో నిర్వాహకులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు చొరవ చూపి వంట గదిని నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు



## పెద్ద సార్లంతా వెళ్తారు.. పెద్దగా పట్టించుకోరు

నగర పంచాయతీలోని తహసీల్దార్, ఎంపీడీవో, సబ్ రిజిస్ట్రార్, వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లే దారిలో చెత్తకుప్పలుగా పేరుకుపోయింది. పశువులు చెల్లాచెదురు చేస్తుండటంతో గాలికి ప్లాస్టిక్ కవర్లు కార్యాలయాలవైపు పడుతున్నాయి. ఆయా కార్యాలయాలకు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చెత్తకుప్ప సమీపంలోకి రాగానే ముక్కు మూసుకుని వెళ్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనే ఇలా ఉంటే వీధుల్లో పరిస్థితి ఏమిటని పురప్రజలు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు



# పరిసరాలు శుభ్రం చేసుకోవాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే; ప్రతి శుక్రవారం గ్రామాల్లో ప్రజలు ఫ్రైడే డ్రైడేను కచ్చితంగా పాటించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా. భాస్కర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన గోనెగండ్లలోని ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం ఆయన గ్రామాల్లో పర్యటించారు. ఆసుపత్రిలోని ప్రసవాల ధ్రువపత్రాల దస్త్రాలు పరిశీలించారు. వైద్య సిబ్బంది ఎవరైనా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డీడీలు రవళి, వైద్యులు, రజిత, కార్తిక్ పాల్గొన్నారు.

## చదువుతోపాటు పోటీ పరీక్షల్లో రాణించాలి



ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు ఇతర పోటీ పరీక్షల్లో రాణించాలని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్ష నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు-విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అంశంపై ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు పోటీ నిర్వహించారు. విజేతలు వరుసగా సిరిచందన (10వ తరగతి), సారా (9వ తరగతి), లోకేశ్ (8వ తరగతి)లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాకీర్, గిరిప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.




## అర్జీదారుల సమస్య పరిష్కరిస్తాం

నందవరం, న్యూస్‌టుడే: ప్రతి అర్జీదారుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని జొహరాపురం గ్రామంలో సభ నిర్వహించి మాట్లాడారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజమైన భూహక్కుదారునికి ఎటువంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు పాసు పుస్తకాల్లోని తప్పులను సరిచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ అక్బర్ బాషా, ఆర్ఐ జర్మియా పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

## గ్రామసభలో 80 ఫిర్యాదులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: మండలంలోని చిలకలదోణ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రైతుల నుంచి రీసర్వేకు సంబంధించి 80 ఫిర్యాదులు స్వీకరించినట్లు తహసీల్దార్ రవి తెలిపారు. వివిధ సమస్యలపై రైతులు తమ అర్జీలను సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

## కె.తిమ్మాపురం గ్రామసభలో 55 వినతులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కె.తిమ్మాపురంలో శుక్రవారం భూముల రీసర్వేపై జరిగిన గ్రామసభలో రైతులు భూసమస్యలపై తహసీల్దార్ శేషఫణికి 55 వినతిపత్రాలు అందజేశారు. కొందరు రైతులు భూసర్వే లోపభూయిష్టంగా జరిగిందని, న్యాయం చేయాలని విన్నవించారు. ఇప్పటి వరకు ఆరు గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో 348 మంది రైతులు దరఖాస్తులు అందజేశారు.

## రీసర్వే లోపాలపై 11 అర్జీలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్.ఖానాపురం గ్రామంలో తహసీల్దార్ రామాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. భూరీసర్వేలో లోపాలపై 11 అర్జీలు వచ్చినట్లు ఆయన తహసీల్దార్ పేర్కొన్నారు. వాటిని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మునిస్వామి, డీటీ లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సి.బెళగల్‌లో...

ముడుమాల (సి.బెళగల్), న్యూస్‌టుడే : గ్రామంలో ఇటీవల జరిగిన రీసర్వేల్లో రైతులకు పొలాల్లో విస్తీర్ణం, కొలతల్లో తేడాల సమస్యల పరిష్కారంపై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని ముడుమాల గ్రామంలో సచివాలయంలో శుక్రవారం వీఆర్వో అక్బర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సదస్సులో 82 మంది రైతులు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగభూషణం, సచివాలయం సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## మోటార్ల సామగ్రి ధ్వంసం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రకోటలో నియోజకవర్గ మాజీ ప్రజాప్రతినిధి పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్తు మోటార్ల సామగ్రి ధ్వంసం చేశారు. డ్రిప్ పరికరాలు, తీగలు కోసేయడం, పదికిపైగా కాయలు కాసే చీనీ చెట్లను నరికేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐదు గ్రామాల్లో మూడు దశాబ్దాలకుపైగా మాజీ నియోజకవర్గ ప్రజాప్రతినిధి చెప్పినదే వేదమన్నట్లు సాగింది. ఎన్నికల్లోనూ ఇక్కడ ఏకపక్షంగా పోలింగ్ జరిగేది. గట్టి పట్టున్న సొంత గ్రామంలోని తన పొలంలో చీనీ చెట్లు నరకడం, విద్యుత్తు మోటార్ల సామగ్రి ధ్వంసం చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

## సూగూరు కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లుకుంట గ్రామం వద్ద ప్రవహిస్తున్న సూగూరు మేజర్ కాల్వలో శుక్రవారం ఉదయం ఓ మహిళ మృతదేహం కొట్టుకువచ్చింది. సుమారు 60 ఏళ్ల వృద్ధురాలిగా గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శవ పరీక్ష నిమిత్తం ఆటోలో ఆదోని ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు.

## పీఎం కిసాన్‌కు రైతుల నిరీక్షణ

నందవరం, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ పడలేదని మిట్టా సోమాపురం గ్రామానికి చెందిన రైతులు నందవరం మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరీక్షించారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చిన రైతులు అయ్యప్ప, బెస్త అనంతమ్మ, బోయ లింగమూర్తి, నరసింహులు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రెండేళ్ల నుంచి తమ ఖాతాలకు జమ కావడం లేదని, ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా మా సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

## కార్మికుల ఈఎస్ఐ నిధుల దుర్వినియోగం


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులకు చెందిన ఈఎస్ఐ నిధులను ప్రతి కార్మికుని పేరుతో రూ.360 ప్రభుత్వం జమ చేస్తున్నా సేవలందడం లేదని సీఐటీయూ నాయకులు రాముడు ఆరోపించారు. శుక్రవారం పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో పట్టణంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘం నాయకులు నాగరాజు, ఈరన్న, కేశన్న, సోమన్న, శాంతప్ప, ఉరుకుందు, తిక్కయ్య, రంగన్న, లక్ష్మన్న పాల్గొన్నారు

## ఈవోఆర్డీలకు ఘన సన్మానం

సి.బెళగల్, న్యూస్‌టుడే: పదవీ కాలంలో చేసిన మంచి పనులే గుర్తింపునిస్తాయని ఈవోఆర్డీ సందీప్ అన్నారు. సి.బెళగల్ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బి.మునెప్ప అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. సర్పంచులు శ్రీనివాసులు, అమర్, అభిషేక్ ఆయన సేవలను కొనియాడారు. అనంతరం నూతనంగా వచ్చిన ఈశ్వరయ్య స్వామి, సందీప్‌లను సన్మానించారు. మండల ప్రత్యేకాధికారిణి శ్యామల, ఎంపీడీవో రాణెమ్మ, పర్యవేక్షకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు..


ఈవోఆర్డీలతో సర్పంచులు, ఇతర అధికారులు

## పచ్చపురుగు నివారిస్తే అధిక దిగుబడులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: వేరుసెనగలో పచ్చపురుగు నివారణకు స్పినోసాడ్ మందును పిచికారీ చేయాలని కర్నూలు ఏరువాక కేంద్రం సమన్వయకర్త సుజాత సూచించారు. శుక్రవారం ఆమె గోనెగండ్లలోని పొలాల్లో పర్యటించి వేరుసెనగ పంటలు పరిశీలించి మాట్లాడారు. పచ్చపురుగు నివారణకు స్పినోసాడ్ 0.3 మి.మీ. లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. లద్దె పురుగు నివారణకు ఏమామెక్టిన్ బెంజోఎట్ 0.3 గ్రాములు, 2 శాతం బెల్లం పాకం కలుపుకొని చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, మహేంద్ర పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం సమన్వయకర్త సుజాత

## పశుగణన ప్రారంభం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కడిమెట్ల తదతర గ్రామాల్లో శుక్రవారం పశుగణన ప్రారంభమైంది. కడిమెట్లల్లో ఎంపీపీ కేశన్న, సర్పంచి మారెప్ప, పశువైద్యాధికారి నరేంద్ర కరపత్రాలు విడుదల చేశారు.

## గోడ పత్రాల విడుదల

గోనెగండ్ల, న్యూస్‌టుడే: 21వ అఖిల భారత పశుగణన గోడ పత్రాలను ఎంపీడీవో మణిమంజరి శుక్రవారం విడుదల చేశారు. నవంబరు 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పూర్తి చేస్తామన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, సర్పంచి హైమావతి పాల్గొన్నారు.

## ఆటో కార్మికులను విస్మరించిన ప్రభుత్వం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులను పూర్తిగా విస్మరించిందని ఏఐటీయూసీ నాయకులు మునెప్ప ఆరోపించారు. శుక్రవారం ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు విజేంద్ర, రవి, నరసింహ పాల్గొన్నారు.

## పంట ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలి

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేయాలని ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రీ అన్నారు. శుక్రవారం ఏడీఏ కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల వీఏఏలకు శిక్షణ నిర్వహించి మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, సూక్ష్మ బిందుసేద్యం ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, నాగసరోజ, శశిధర్‌రెడ్డి, శ్రీవాణి పాల్గొన్నారు.

## హామీల అమలే చంద్రబాబు లక్ష్యం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ఎన్నికల హామీల అమలే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని జిల్లా తెలుగు మహిళా అధికార ప్రతినిధి శశిరేఖ అన్నారు. శుక్రవారం ఆమె తన గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాట ప్రకారం దీపావళికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## కబడ్డీలో సత్తా చాటాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటాలని మాచాని సోమప్పనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శకుంతలమ్మ, పీడీ శ్రీనివాసులు అన్నారు. పదో తరగతి విద్యార్థి వినోద్‌కుమార్ అండర్-17 విభాగంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

# మైదానంలో గ్రామీణ చిరుతలు

☛ రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణింపు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. తమకు నచ్చిన క్రీడలో సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటుతున్నారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ఎంపికయ్యారు ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు.

### రెండు క్రీడల్లోనూ సత్తా

– శివనాగచైతన్య, 9వ తరగతి



నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఎంతో ఇష్టం. వాలీబాల్, హాకీ సాధన చేసి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాను. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు తరఫున ఆడాను. తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం చెందిన జట్లతో తలపడి విజయం సాధించాం. 2022లో తూర్పు గోదావరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ క్రీడాకారునిగా అవార్డు తీసుకున్నా. అలాగే 2021, 2022లో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీలోనూ ప్రతిభ కనబర్చాను. హాకీ, వాలీబాల్‌లో ఈ ఏడాది జరిగే జాతీయ క్రీడలకు సాధన చేస్తున్నాను.

### బంతి దొరికితే గోల్ చేయడమే

– తాయన్న 9వ తరగతి



నాకు ఫుట్‌బాల్ క్రీడంటే ఎంతో ఇష్టం. ప్రతి రోజూ ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సాధన చేస్తున్నాను. ఐదేళ్లుగా ఈ క్రీడలో రాణిస్తున్నాను. రైట్ ఫార్వర్డ్‌లో బంతి దొరికితే గోల్ వైపు మళ్లించడమే లక్ష్యంగా సాధన చేశాను. హిందూపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడలో పాల్గొన్నాను. 2023లో జూనియర్ విభాగంలోనూ ప్రతిభ చాటా. గుంటూరులో జరిగిన పోటీల్లో ఉత్తమ క్రీడాకారునిగా ప్రతిభా పురస్కారం అందుకున్నాను. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు హిందూపురంలో సాగుతున్నాయి. అందులో పాల్గొంటూనే జాతీయ పోటీలకు సాధన చేస్తున్నాను.

### రోజూ మూడు గంటల సాధన

– భూమిక, 10వ తరగతి



నాకు వాలీబాల్ క్రీడంటే ఎంతో ఇష్టం. ఈ నెలలో హిందూపురం జిల్లా ముదిరెడ్డిపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటా. ప్రకాశం, అనంతపురం జట్లతో తలపడ్డాం. రెండు జట్లతో పాయింట్లు సాధించి ప్రతిభా పురస్కారం అందుకున్నా. 2021లో నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చాను. అలాగే 2022లో వైజాగ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించా. అలాగే జాతీయ క్రీడల్లో రాణించేందుకు ప్రతిరోజూ మూడు గంటలపాటు మైదానంలో సాధన చేస్తున్నాను.

# కర్నూలు

• కర్నూలు • పాణ్యం

## పకడ్బందీగా పశుగణన

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అఖిల భారత పశు గణన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పకడ్బందీగా వివరాలు సేకరించాలని చెప్పారు. విషయ సేకరణదారులు ఇంటింటికి వెళ్లి పశువుల సమగ్ర సమాచారం సేకరిస్తారని పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డా.దుర్గప్రసాద్‌బాబు, సహాయ సంచాలకులు డా.డీపీ పార్థసారథి తెలిపారు.



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

## బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి దివంగత భూషణ్‌రావు ఎంతో కృషి చేశారని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలోని బాస్కెట్ ఎరినాలో భూషణ్‌రావు స్మారక ఆహ్వానిత రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను గ్రూప్ కమాండర్ కల్నల్ రమేష్, డా.డబ్ల్యు. సీతారాం, ఇండస్ విద్యా సంస్థల ప్రతినిధి విల్సన్ తదితరులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు.

## సత్వరం పరిష్కరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఆయన శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వివిధ అంశాలపై ప్రత్యేకాధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను గడువు దాటకముందే పరిష్కరించాలని చెప్పారు. ఉపాధి పనులు కల్పించడంలో ఎంపీడీవోలు, ఏపీవోలు నిర్లక్ష్యం వీడాలన్నారు.

## 29న ఎంపిక పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: డీఎస్‌ఏ స్టేడియంలో 29న ఆలిండియా సివిల్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు శుక్రవారం తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు నవంబరు 6 నుంచి 9వ తేదీ వరకు విజయవాడలోని ఐజీఎంసీ మైదానంలో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్.ఉషారాణి తొమ్మిదో తరగతి చదువుతోందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632 కర్నూలు గ్రామీణం : 85010 05408 ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : సమస్య: ఇందిరాగాంధీ నగర్, సీతారాంనగర్‌లలో కాలువలు శుభ్రం చేయాలి. వ్యర్థాలు పేరుకుపోయాయి. **- స్థానికులు**

**సమస్య:** కల్లూరులో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మనుషులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. **- సుధీర్ రెడ్డి**

**సమాధానం:** సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగరపాలక సంస్థ అధికారులు**

# నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

■ తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి ■ అక్రమాలపై విజిలెన్స్ విచారణ ■ నగరపాలక సమావేశంలో మంత్రి భరత్



హాజరైన మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, దస్తగిరి, కార్పొరేటర్లు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఎస్బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక పాలకవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రితోపాటు మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కమిషనర్ రవీంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరు తీర్మానాలు ఆమోదించారు. వ్యాపారవేత్త రతన్ టాటా మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. మంత్రి హోదాలో తొలిసారి పాలకవర్గ సమావేశానికి వచ్చిన మంత్రి టీజీ భరత్‌ను సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్ని వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్లు తెలిపిన సమస్యలను తప్పనిసరిగా మినిట్స్ పుస్తకంలో రాసుకోవాలని అధికారులకు సూచించారు. కమ్యూనిటీ భవనాల్లో సచివాలయాలు నిర్వహిస్తున్నారని, ఖాళీ చేయించి వేరే ప్రదేశానికి మార్చాలన్నారు.

### పార్కు స్థలాల ఆక్రమణ

కల్లూరు పట్టణ పరిధిలో పార్కు స్థలాలు ఆక్రమణకు గురికాకుండా కమిటీ వేయాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కోరారు. పార్కు స్థలాలు కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని.. ఆధారాలతో సహా నిరూపిస్తామన్నారు. కల్లూరు కాలనీలకు రెండు మూడు రోజులకో సారి తాగునీరు అందిస్తున్నారని చెప్పారు.

☛ కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కోరారు.

### స్థానాల మార్పు మంచి నిర్ణయం

నగరపాలకసంస్థ రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేయడం మంచి నిర్ణయమని పలువురు కార్పొరేటర్లు అన్నారు. ఆర్ఐల స్థానాలు మార్చడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ కేవలం ఆర్ఐలను మాత్రమే మార్చారని.. ఇతర విభాగాల్లో మార్పులు చేయలేదన్నారు. కమిషనర్ మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం నిమిత్తం కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని, కార్పొరేటర్లు ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిదని సమాధానమిచ్చారు.

### ఇరువర్గాల వాగ్వాదం

పాలకవర్గ సమావేశంలో కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. సి.క్యాంపు సమీపంలో మహిళలకు సంబంధించిన మరుగుదొడ్ల వద్ద దుకాణాలు ఏర్పాటుచేశారని.. వీటిని తొలగించాలని పలువురు కోరారు. అధికారులు, నేతలు స్పందించలేదు. దీంతో ఆ వార్డుకు చెందిన కార్పొరేటర్ కఠారి పల్లవి పదేపదే ఆ విషయాన్ని ప్రస్తావించారు. కార్పొరేటర్ పరమేష్ జోక్యం చేసుకొని మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తుంగభద్ర సమీపంలో భూమి కబ్జా చేశారని, చైనీస్ ఫాస్ట్ ఫుడ్ వారి వద్ద డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైకాపా, తెదేపా కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. వాగ్వాదం సమయంలో ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, దస్తగిరి వెళ్లిపోయారు. మేయర్ సభను పది నిమిషాలు వాయిదా వేశారు.



వాగ్వాదం చేసుకుంటూ..

### కార్పొరేటర్లు ఏమి మాట్లాడారంటే..

- సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ.82 కోట్లతో చేపట్టిన పైపులైను పనుల్లో అక్రమాలు జరిగాయి. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి.
- కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని కాలనీలకు తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలి. పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలి.
- 23వ వార్డు సి.క్యాంపు సమీపంలో అక్రమంగా దుకాణాలు వేశారు. వాటిని తొలగించాలి.
- వైకాపా ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ గురించి గత మూడేళ్లుగా మాట్లాడలేదు. రంగులు వేసేందుకే సరిపోయింది.
- 10వ వార్డులో షాదీఖాన్ కమిటీ వేశారు. దీనిని రద్దు చేయాలి.
- 386/3ఎ సర్వే నంబరులో ఎల్‌పీ నంబరు 91-89లో రెండు వెంచర్లు ఉన్నాయి. ఇందులో నగరపాలకకు కేటాయించిన స్థలం మాయమైంది.
- వెంకటరమణ కాలనీలో మసీదు వద్ద ఓ దారిని నగరపాలక.. బిల్డర్‌కు రాసిచ్చింది.
- ఏ సమస్య చెప్పినా విద్యుత్తు శాఖ అధికారులు స్పందించడం లేదు.
- నందికొట్కూరు రోడ్డులో వర్షం కురిస్తే రహదారిపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.



వడ్డిస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా

## రూ.5కే నాణ్యమైన భోజనం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని రూ.5కే అందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆయన శుక్రవారం సర్వజన సర్వజన వైద్యశాలలోని సూపర్ స్పెషాలిటీ విభాగం పక్కన ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడారు. అనంతరం మంత్రి స్టేట్ క్యాన్సర్ యూనిట్‌ను పరిశీలించారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, నగర కమిషనర్ రవీంద్రబాబు, టూరిజం డైరెక్టర్ ముంతాజ్, స్టేట్ క్యాన్సర్ యూనిట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

## విచారణ వాయిదా

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో బోగస్ ధ్రువీకరణ పత్రాలపై ముత్యాల బాలుడు, బి.అంకిరెడ్డి తదితరులు ఫిర్యాదు చేయగా శుక్రవారం లోకాయుక్తలో విచారణ జరిగింది. పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని విచారణను నవంబరు 26వ తేదీకి వాయిదా వేశారు.

# ప్రతిభ చూపి.. విజేతలుగా నిలిచి



టంగుటూరి ప్రకాశం పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయొచ్చని ప్రకాశ్ నగర్‌లోని టంగుటూరి ప్రకాశం స్మారక నగరపాలక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.విజయకుమార్ అన్నారు. ఆ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ప్రథమ స్థానంలో ఎస్.మహేజాబిన్ (ఎనిమిదో తరగతి), ద్వితీయ స్థానంలో సి.ప్రత్యూష (తొమ్మిదో తరగతి), తృతీయ స్థానంలో ఎస్.మిస్బానూరీన్ (తొమ్మిదో తరగతి) నిలిచారు. వారికి బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ



డా.ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం డా.ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలలో వ్యాసరచన పోటీలు జరిగాయి. ఇ.సుహృతి (పదో తరగతి), టీపీ సాయి లిఖిత (పదో తరగతి), పి.గిరీశ (తొమ్మిదో తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. హెచ్ఎం ఎల్.విజయలక్ష్మి తదితరులు బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

## ఉచిత ఇసుక విధానంతో మేలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో మేలు చేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిన సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ తన కార్యాలయం వద్ద శుక్రవారం చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గ్రూపులుగా ఏర్పడి ఇసుకతో వ్యాపారం చేయాలని చూస్తే ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానంతో ధరలు భారీగా తగ్గాయని.. భవన నిర్మాణాలు పెరిగి కార్మికులకు పని లభిస్తోందని చెప్పారు.

## ప్రజలపై విద్యుత్తు భారం మోపొద్దు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు బి.క్యాంపు, వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: విద్యుత్తు భారాన్ని ప్రజలపై మోపితే మరో విద్యుత్తు ఉద్యమం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ హెచ్చరించారు. నగరంలోని విద్యుత్తు కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.8,114 కోట్ల భారం వేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం డీఈ (సాంకేతిక)కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, సాయిబాబా, సుధాకరప్ప, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మద్దూర్ నగర్‌లో వ్యక్తిపై దాడి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మద్దూర్ నగర్‌కు చెందిన సందీప్‌రెడ్డిపై దాడి జరిగింది. ఇతను గురువారం రాత్రి తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా మత్తులో ఉన్న లోకేశ్, అతని స్నేహితుడు అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేశారు. లేవని చెప్పటంతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ప్రతిఘటించి నిందితుడి వద్దనున్న ఆయుధాలు లాక్కొని కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పగించి లోకేశ్‌పై ఫిర్యాదు చేశారు.

## కఠిన చర్యలు తీసుకోవాలి



విగ్రహాలను పరిశీలిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: దేవాలయాన్ని కూల్చే ప్రయత్నం చేసిన శంకరయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ విశేష సంపర్క రాష్ట్ర ప్రముఖ్ టి.ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నగర శివారులోని బి.తాండ్రపాడులో పురాతన శివాలయం పునర్నిర్మాణం చేపట్టారు. పక్కనున్న వ్యక్తి ఆలయాన్ని కూల్చేడంతో ఆలయ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## సభ్యత్వం నమోదు చేసుకోవాలి

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి కార్యకర్త తెదేపా సభ్యత్వ నమోదు చేసుకోవాలని తెదేపా సీనియర్ నేత వై.రామేశ్వర్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ జగన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం అన్నివిధాలా వెనుకబడిందని చెప్పారు. కుటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి అభివృద్ధి పుంజుకుందని చెప్పారు. నాయకులు ఆదిత్యారెడ్డి, సాంబశివరావు, పేరపోగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దులపై స్పష్టత ఇవ్వండి

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: నందనపల్లె గ్రామ పరిధిలో జలవనరులు, నగర వనం, పట్టా భూముల సరిహద్దులు చూపాలని, హద్దులు లేని కారణంగా తరచూ వివాదాలు రేగుతున్నాయని రైతులు కోరారు. నందనపల్లె నగర వనం వద్ద భూ సరిహద్దుల విషయంలో స్పష్టత లేకపోవడంతో రైతులు, జలవనరులు, అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే నిర్వహించారు. రైతులు చూపిన భూ రికార్డుల ప్రకారం భూమిని కొలిచామని.. వివిధ శాఖల రికార్డులు పరిశీలిస్తే తప్ప సరిహద్దు విషయంలో స్పష్టత రాదని అధికారులు పేర్కొన్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు చేరుకుని సరిహద్దు విషయమై స్పష్టత ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరారు.

## సంక్షిప్త సమాచారం

సల్కాపురం (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: సల్కాపురం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి 83 దరఖాస్తులు వచ్చాయి. డిప్యూటీ కలెక్టర్ వెంకట నారాయణమ్మ, తహసీల్దారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** కల్లూరు మండల సమాఖ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా జుబేదాబీ, ఉపాధ్యక్షురాలిగా అరుణమ్మ, కార్యదర్శి ఈశ్వరమ్మ, కోశాధికారి రాణి, సంయుక్త కార్యదర్శిగా ఎం.రాణి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :** అఖిల భారత పశుగణన గోడపత్రాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ శుక్రవారం ఆవిష్కరించారు. పకడ్బందీగా పశుగణన చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డా.శ్రీనివాస్, డీడీ హేమంత్ కుమార్, ఏడీలు సుధాకర్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :** జిల్లా రెవెన్యూ అధికారిణి సీవీ నారాయణమ్మ శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

**ఓర్వకల్లు, న్యూస్‌టుడే:** ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు సాగు చేయొచ్చని డీఎల్ఎంపీ లక్ష్మయ్య అన్నారు. ఓర్వకల్లులో ప్రకృతి వ్యవసాయంపై వెలుగు సీసీలు, వీవోఏలు తదితరులకు శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు.

**కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే :** పార్వతీపురంలో త్వరలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎడిపై పాఠశాల ప్రిన్సిపల్ జోసఫ్ డేవిడ్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆర్చరీ శిక్షకుడు వంశీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిమ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే :** మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇక్బాల్‌హుస్సేన్, షరీఫ్ డిమాండ్ చేశారు. వారు శుక్రవారం మాట్లాడుతూ నిందితులపై నిర్భయ చట్టం అమలుచేయాలని కోరారు.

**కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :** ఇసుక పాలసీపై రాష్ట్ర గనులు, భూగర్భశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్సు ద్వారా శుక్రవారం సమీక్షించారు. కర్నూలు నగరం మీదుగా తుంగభద్ర నది ప్రవహిస్తున్న నేపథ్యంలో నగరాన్ని లోకల్ ఏరియా కింద అనుమతి ఇవ్వాలని కలెక్టర్ రంజిత్ బాషా కోరగా ప్రిన్సిపల్ సెక్రటరీ అంగీకరించారు.

**కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే:** నగరానికి చెందిన రజిత (25) అనే గర్భిణికి రక్తపోటు అధికం కావడంతో 7 నెలల్లోనే ప్రసవం చేయాల్సి వచ్చింది. దీంతో అరుదైన శస్త్రచికిత్స చేసి శిశువు ప్రాణాలు కాపాడినట్లు అశ్విని ఆసుపత్రి పీడియాట్రిక్ వైద్యుడు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో డాక్టర్ ప్రమీల, డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రఘురాంతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

**కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీవో రాముడు తెలిపారు. ఎర్రదొడ్డి గ్రామంలో శుక్రవారం ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు.

## నిధులిచ్చినా పనులు ప్రారంభించరా?



మాట్లాడుతున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: సాగునీటి ప్రాజెక్టు పరిధిలో అత్యవసర నిర్వహణ (ఓఅండ్ఎం) పనులకు నిధులు విడుదల చేసినా పనులు చేపట్టడంలో జాప్యం ఎందుకవుతోందని జలవనరుల శాఖ నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఈ నెల 28 తేదీలోగా షార్ట్ టెండర్లను ఆహ్వానించి పనులు ప్రారంభించని ఇంజినీర్లకు తాఖీదులు జారీ చేయాలని ఆదేశించారు. అమరావతి నుంచి శుక్రవారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో కర్నూలు సర్కిల్ కార్యాలయం నుంచి ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్, డీఈఈ విజయకుమార్ హాజరయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాజెక్టులకు సంబంధించి 178 పనులకు రూ.19 కోట్లు విడుదలయ్యాయని, ఎల్లెల్సీ పరిధిలో రూ.2.30 కోట్లతో 16 పనులకు టెండర్లను ఆహ్వానించామని, కేసీసీ పరిధిలో టెండర్ల ప్రక్రియ సాగుతోందని ఎస్ఈ వివరించారు. గాజులదిన్నె, గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలో త్వరలోనే టెండర్లను ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామన్నారు.

## హైకోర్టు ఏర్పాటుపై తీర్మానం చేయాలి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులో హైకోర్టు ఏర్పాటుపై మంత్రివర్గంలో సమావేశంలో తీర్మానం చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, రవికాంత్‌ప్రసాద్ కోరారు. స్థానిక జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశానికి సీనియర్ న్యాయవాదులు ఓంకార్, సుబ్బయ్య, చల్లా ప్రభాకర్‌రెడ్డి, రవిగువేరా, నాగశేషయ్య, కృష్ణమూర్తి తదితరులు హాజరయ్యారు. హైకోర్టు బెంచి కాకుండా హైకోర్టు కావాలన్నారు. 15 రోజుల్లో ఎలాంటి స్పందన లేకుంటే ఉద్యమిస్తామన్నారు. న్యాయవాదుల సమస్యలపై ప్రభుత్వం నుంచి స్పందన లేదని పేర్కొన్నారు.

## విభేదాలు తీవ్రం..

# పాలనకు విఘాతం

• నగరపాలక సంస్థలో ఇదీ పరిస్థితి



కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలక సంస్థలోని పలు విభాగాల్లో కొందరి మధ్య అంతర్గత విభేదాలు నెలకొన్నాయి. ఇటీవల ఇద్దరు అధికారుల మధ్య మాటల యుద్ధం జరిగింది. దీంతో కింది స్థాయి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అధికారుల మధ్య విభేదాల నేపథ్యంలో తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పాలనపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయని పలువురు పేర్కొంటున్నారు.

### తారాస్థాయికి చేరుకుని..

పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగంలోని పలువురి మధ్య అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇటీవల ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగినట్లు సమాచారం. వెంకటరమణ కాలనీ సమీపంలోని ఓ బహుళ అంతస్తు నిర్మాణం వద్ద మురుగునీటి కాలువ, సీసీ రహదారుల నిర్మాణ విషయంలో విభేదాలకు దారితీసినట్లు తెలిసింది. కాలువలు, రహదారుల పనులకు సంబంధించి కొలతలు వేసి ఇవ్వాలని ఇంజినీరింగ్ విభాగంలోని ఓ అధికారి అడగ్గా.. అధికారికంగా యు.నోట్ ఇస్తే కొలతలు వేసి ఇస్తామని పట్టణ ప్రణాళికకు చెందిన ఓ అధికారి సమాధానమిచ్చారు. ఇలా కొన్ని సందర్భాల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. అన్ని విభాగాలు సమన్వయంతో కలిసికట్టుగా వెళ్లాల్సి ఉండగా విభేదాల కారణంగా నగరపాలక సంస్థకు నష్టం వాటిల్లే ప్రమాదముంది.

### వెనక్కి రావాలంటూ..

ఇంజినీరింగ్ విభాగానికి చెందిన దాదాపు ఆరుగురు సిబ్బంది పట్టణ ప్రణాళిక విభాగంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని ఇంజినీరింగ్ విభాగానికి తిరిగి రావాలని ఆదేశాలు వచ్చాయి. ఇటీవల జరిగిన ఘటనల నేపథ్యంలో వారిని వెనక్కి పిలిచినట్లు సమాచారం. దీంతో సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. వీరు వెళితే పట్టణ ప్రణాళిక విభాగంలో సిబ్బంది కొరత ఏర్పడే అవకాశం నెలకొంది.

○ రెవెన్యూ విభాగంలోనూ కొందరి మధ్య విభేదాలు ఉన్నట్లు బహిరంగంగా చెప్పుకొంటున్నారు. ఓ అధికారి తనపై పనిభారం ఎక్కువగా పడుతోందని.. ఒక్కరే పనిచేయాలంటే ఇబ్బందులు తలెత్తుతాయని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు సమాచారం.

### నలుగుతున్న సిబ్బంది

ఆయా విభాగాల అధికారుల మధ్య విభేదాల నేపథ్యంలో నగరపాలక సంస్థలో కిందిస్థాయి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొన్ని విభాగాల్లో పనిభారం పెరుగుతోందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు పంతాలకు పోతున్నారని.. దీనికితోడు కొంతమంది కింది స్థాయి సిబ్బందిని లక్ష్యంగా చేసుకొని ఇబ్బందులకు గురిచేసే కార్యక్రమాలు జరుగుతున్నాయని నగరపాలకలో చర్చించుకుంటున్నారు. ఫలితంగా పాలనపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. ఉన్నతాధికారులు వీటన్నింటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొంటున్నారు.

## రహదారి తప్పింది..



కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డు వెనుక గేటు వద్ద రహదారి పనులు అసంపూర్తిగా వదిలేశారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కంకర వేసి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి పనులు చేయకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

## పనులు అసంపూర్తి.. రాకపోకలకు ఇబ్బంది



కర్నూలు వెంకటరమణ కాలనీ పరిధిలోని అమీన్ అబ్బాస్ నగర్ ప్రాంతంలో మురుగు కాల్వల నిర్మాణం కోసం గుంతలు తీశారు. ఆ తర్వాత పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు రహదారులపైకి చేరుతోంది. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, వెంకటరమణ కాలనీ